# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 25-07-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దే పెట్టుబడుల ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**
2. **రాష్ట్రంలో 2 వేల కిలోమీటర్ల మేర కొత్త రహదారుల నిర్మాణం చేపట్టనున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు.**
3. **తెలంగాణలో కులగణన సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించామని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి తెలిపారు.**
4. **భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ "విమానయాన కేంద్రం"గా మారనుందని పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి పేర్కొన్నారు.**
5. **తెలంగాణ రోడ్డు రవాణా సంస్థని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు వీలుగా కేటాయింపులు, పెట్టుబడుల ప్రతిపాదనలను రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న జరిగిన మంత్రి వర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వివరాలను రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి పాత్రికేయులకు వివరించారు. రాష్ట్రంలో 79 వేల 900 కోట్ల రూపాయల విలువైన పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామని వీటి ద్వారా ఇంధన, ఐటీ రంగాల్లో లక్షలమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలియజేస్తూ..

వాయిస్ .. 25సెకన్లు

అలాగే 'ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ విధానం 4.0', విజయవాడ, విశాఖ నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులకు టెండర్లు పిలిచేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని మంత్రి వివరించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వెయ్యి కోట్ల రూపాయలతో 2 వేల కిలోమీటర్ల మేర కొత్త రహదారుల నిర్మాణం చేపట్టనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో

రహదారులు భవనాల శాఖపై సంబంధిత అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన కొత్త రోడ్ల నిర్మాణం, జాతీయ రహదారుల తరహాలో నిర్దేశిత ప్రమాణాలతో నిర్మించాలని, అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం–పీపీపీ విధానంలో రహదారుల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

తెలంగాణలో కులగణన సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వేపై ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు, నాయకులకు ముఖ్యమంత్రి గత సాయంత్రం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో సామాజిక, ఆర్థిక, కుల, రాజకీయ సర్వే సమగ్రంగా చేపట్టామని తెలిపారు.

మరోవైపు.. తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈరోజు సమావేశం కానుంది. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఈ సమావేశం జరుగనుంది.

---------------------------

భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ “విమానయాన కేంద్రం” గా మారనుందని పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పెట్టుబడుదారులు, పారిశ్రామికవేత్తలు మంత్రిని నిన్న మర్యాదపూర్వకంగా కలిశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారులు, ఓడరేవులు, విమానాశ్రయాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఏవియేషన్ సంస్థలు ముందుకు వస్తున్నాయని చెప్పారు. పెట్టుబడుల రాకతో నిరుద్యోగ యువతకు.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు.

---------------------------

దేశంలో అత్యుత్తమ నగల తయారీ కేంద్రాన్ని మంగళగిరిలో నిర్మించనున్నామని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లాలోని ఉండవల్లిలో మంగళగిరి జెమ్స్ జ్యువెలరీ పార్కు ఏర్పాటుపై అధికారులతో మంత్రి గత సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ... మంగళగిరిలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. దీని ద్వారా ఆభరణాల తయారీలో ప్రపంచస్థాయి శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని నారా లోకేష్ సూచించారు.

---------------------------

తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ టీజీఎస్ఆర్టీసీని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఉచిత బస్సు పథకంలో 200 కోట్ల మంది ఉచిత ప్రయాణాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మం కొత్త బస్టాండ్ లో ఏర్పాటు చేసిన వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. అనంతరం రఘునాథపాలెం మండలం మూలగూడెంకు టిక్కెట్ కొని ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్..25 సెకన్లు

-----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 124వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈరోజు సాయంకాలం వరకు పంపవచ్చు.

-----------------------------

తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి మెరుగైన అవకాశాలు ఉన్నాయని పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ యూఏఈ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా 'ఇన్వెస్టోపియా గ్లోబల్' పేరుతో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024-25 ఆర్థిక సంవత్సరంలో యూఏఈకి తెలంగాణ ఎగుమతులు 2.5 రెట్లు పెరిగాయన్నారు. రాష్ట్రాన్ని 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి తెలిపారు.

-----------------------------

రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ విద్యుత్ కమిటీ -ఎస్ఆర్‌పీసీ సమావేశం ఈరోజు నుంచి రెండు రోజుల పాటు జరగనుంది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల విద్యుత్ సంస్థల అధికారులు పాల్గొంటారు. ఈ సదస్సులో గత ఏడాది డిస్కంలలో ఉపయోగించిన సాంకేతికత.. విద్యుత్ వినియోగం, దక్షిణాది గ్రిడ్ నిర్వహణ, సరఫరా లైన్లకు సంబంధించి రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలు, కొత్త ప్రాజెక్టులకు అనుమతులపై చర్చిస్తారని అధికారులు తెలిపారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తున్న కంప్రెస్డ్ బయోగ్యాస్-సీబీజీ కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన కౌలు, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.గ్రీన్ ఎనర్జీలో భాగంగా సీబీజీ ప్లాంట్లు నిర్మాణాలు - ప్రాజెక్టులకు స్థలాల కేటాయింపు వంటి అంశాలపై రిలయన్స్ సంస్థ ప్రతినిధులతో అమరావతిలో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకాశం జిల్లాను ఇంటిగ్రేటెడ్ సీబీజీ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని వాయుమడుగు, పీసీ పల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ప్లాంట్లను 2026 నాటికి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

-----------------------------

భారత్ ఇంగ్లాండ్ జట్ల మధ్య మాంచెస్టర్ వేదికగా జరుగుతున్న నాలుగవ టెస్టు మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 358 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 46 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. ఈ రోజు మ్యాచ్ కొనసాగనుంది.

-----------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంకు అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని

అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ...

వాయిస్..30 సెకన్లు

మరోవైపు.. తెలంగాణలోనూ రానున్న రెండు రోజుల పాటు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

======================